శబ్ద కాలుష్యాన్ని వెదజల్లుతున్న పబ్బులపై చేపట్టిన చర్యలేమిటి?

రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు

హైదరాబాద్, సెప్టెంబర్ 20 (నమస్తే తెలంగాణ): శబ్ద కాలుష్యంతో ప్రజలకు ఇబ్బంది కలిగిస్తున్న పబ్బులపై చేపట్టిన చర్యలేమిటో తెలియజేయాలని హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి రాయదుర్గ్‌లోని రెడ్ రైనో పబ్, పోస్ట్‌కార్డ్ రెస్టారెంట్, గ్లోబల్ తపస్ బార్‌ల నుంచి వెలువడుతున్న శబ్ద కాలుష్యం ఆ చుట్టుపక్కల నివసిస్తున్న ప్రజల ప్రశాంతతకు భంగం కలిగిస్తున్నదంటూ బర్కత్‌పురాకు చెందిన ఆనంద్ అనే వ్యక్తి పిటిషన్ దాఖలు చేశారు. ఆ పబ్బులకు జారీ చేసిన అనుమతులను రద్దు చేసేలా అధికారులను ఆదేశించాలని కోరారు. దీనిపై హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జే శ్రీనివాస్‌రావు ధర్మాసనం శుక్రవారం విచారణ జరిపింది. అధికారులకు నోటీసులు జారీచేసి, తదుపరి విచారణను 4 వారాలకు వాయిదా వేసింది.

చర్లపల్లి జైలుకు జానీ మాస్టర్

14 రోజుల రిమాండ్ విధించిన కోర్టు

హైదరాబాద్ సిటీబ్యూరో, సెప్టెంబర్ 20 (నమస్తే తెలంగాణ): మహిళా డ్యాన్సర్‌పై లైంగిక దాడికి పాల్పడినట్టు ఆరోపణలు ఎదుర్కొంటున్న సినీ కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్‌కు రాజేంద్ర నగర్ కోర్టు 14 రోజులపాటు రిమాండ్ విధించింది. దీంతో పోలీసులు ఆయనను చర్లపల్లి జైలుకు తరలించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఈ నెల 19న గోవాలో జానీ మాస్టర్‌ను అరెస్టు చేసిన పోలీసులు.. శుక్రవారం ఆయనను ఉప్పర్‌పల్లిలోని రాజేంద్రనగర్ కోర్టులో హాజరు పరిచారు. అంతకుముందు ఆయనకు గోల్కొండ ఏరియా హాస్పిటల్‌లో వైద్యపరీక్షలు జరిపించారు. కాగా, ఈ కేసు రిమాండ్ రిపోర్టులో పోలీసులు పలు అంశాలను పొందుపరిచారు. నిందితుడు గత 4 ఏండ్ల నుంచి బాధితురాలిపై లైంగిక దాడులకు పాల్పడుతున్నాడని, 2020లో తొలిసారి ముంబైలో లైంగిక దాడికి పాల్పడినప్పుడు బాధితురాలి వయస్సు 16 సంవత్సరాలేనని ఆ రిపోర్టులో పేర్కొన్నారు. జానీ మాస్టర్ భార్య కూడా బాధితురాలిని బెదిరించిందని, ఈ కేసులో జానీ మాస్టర్ తన నేరాన్ని అంగీకరించాడని తెలిపారు.



మల్లన్నసాగర్ కట్టపైన బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నేతలతో ముచ్చటిస్తున్న మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు. చిత్రంలో ఎమ్మెల్యేలు కొత్త ప్రభాకర్‌రెడ్డి, సునీతాలక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ వెంకట్రాంరెడ్డి

కాళేశ్వరం కొట్టుకుపోతే ఈ నీళ్లెక్కడివి?

ఇదిగో.. 21 టీఎంసీల మల్లన్నసాగరే సాక్ష్యం

- కాంగ్రెస్‌ది దుష్ప్రచారమని తేలిపోయింది
- వరదలనే కాదు, బురద రాజకీయాలనూ తట్టుకొని నిలబడ్డ కాళేశ్వరం
- మాజీ మంత్రి హరీశ్‌రావు వెల్లడి
- ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కలిసి మల్లన్నసాగర్ సందర్శన
- ఆటంకాలు సృష్టించిన పోలీసులు

సిద్దిపేట, సెప్టెంబర్ 20 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు, కాంగ్రెస్ పార్టీ నేతలు కాళేశ్వరం ప్రాజెక్టు మీద చేస్తున్న దుష్ప్రచారం అంతా అబద్ధమేనని తేలిపోయిందని, ఇందుకు గోదావరి జలాలతో నిండిన మల్లన్నసాగర్ రిజర్వాయరే నిదర్శనమని మాజీ మంత్రి హరీశ్‌రావు స్పష్టంచేశారు. భారీ వరదలనే కాదు, బురద రాజకీయాలను కూడా కాళేశ్వరం ప్రాజెక్టు తట్టుకొని నిలబడిందని చెప్పారు. ఉత్తర తెలంగాణ వరప్రదాయిని అయిన సిద్దిపేట జిల్లాలోని మల్లన్నసాగర్ రిజర్వాయర్‌లోకి తొలిసారిగా 21 టీఎంసీల గోదావరి జలాలు వచ్చిన నేపథ్యంలో శుక్రవారం ఆ ప్రాజెక్టును ఎమ్మెల్యేలు కొత్త ప్రభాకర్‌రెడ్డి, సునీతా లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీలు దేశపతి శ్రీనివాస్, యాదవరెడ్డి, వెంకట్రామిరెడ్డి, కార్పొరేషన్ మాజీ చైర్మన్లు దేవీప్రసాద్, ఎర్రోళ్ల శ్రీనివాస్, పంటేరు ప్రతాప్‌రెడ్డి, స్థానిక బీఆర్ఎస్ పార్టీ నేతలు, కార్యకర్తలతో కలిసి మల్లన్నసాగర్‌ను సందర్శించారు. గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మీడియాతో హరీశ్‌రావు మాట్లాడుతూ.. కాళేశ్వరం ప్రాజెక్టు కొట్టుకపోతే మల్లన్నసాగర్‌లో 21 టీఎంసీల నీళ్లు ఎక్కడి నుంచి వచ్చాయని కాంగ్రెస్ నేతలను సూటిగా ప్రశ్నించారు. ఎల్లంపల్లి, లక్ష్మీబరాజ్, అన్నపూర్ణ, రంగనాయకసాగర్, మల్లన్నసాగర్ మీదుగా కొండపోచమ్మ వరకు ఇవ్వాళ గోదావరి జలాలు ప్రవహిస్తున్నాయని చెప్పారు. కాళేశ్వరం ప్రాజెక్టులో అంతర్భాగంగా ఉండటం వల్లనే ఇది సాధ్యమైందని వివరించారు. నిండుకుండలా ఉన్న మల్లన్నసాగర్.. కాళేశ్వరం ప్రాజెక్టులో అంతర్భాగం కాదా? అని ప్రశ్నించారు. మల్లన్నసాగర్ రిజర్వాయర్‌తో పాటు కాల్వలను కూడా 90% మేర బీఆర్ఎస్ ప్రభుత్వమే పూర్తిచేసిందని, కాంగ్రెస్ ప్రభుత్వం మిగతా 10% పనులైన పిల్ల కాల్వలు, పంట కాల్వలను వెంటనే పూర్తిచేయాలని డిమాండ్ చేశారు.

కాంగ్రెస్ మూర్ఖపు మాటలు మానుకోవాలి

కాళేశ్వరం ప్రాజెక్టు కొట్టుకపోయిందన్న మూర్ఖపు మాటలను కాంగ్రెస్ నేతలు ఇకనైనా మానుకోవాలని హరీశ్‌రావు హితవు పలికారు. కేసీఆర్ కట్టించిన అన్న పూర్ణ, రంగనాయక, మల్లన్నసాగర్, కొండపోచమ్మ సాగర్ ఇవన్నీ కాళేశ్వరం ప్రాజెక్టులో అంతర్భాగమేనని వివరించారు. అన్నపూర్ణలో 3 టీఎంసీలు, రంగనాయక సాగర్‌లో 3 టీఎంసీలు, మల్లన్నసాగర్‌లో 21 టీఎంసీలు, కొండపోచమ్మసాగర్‌లో 10 టీఎంసీల నీళ్ల నింపుకోవడం చాలా సంతోషంగా ఉన్నదని చెప్పారు. కాంగ్రెస్‌ది డైవర్షన్ పాలిటిక్స్ అయితే, బీఆర్ఎస్‌ది వాటర్ డైవర్షన్ అని చెప్పారు. బీఆర్ఎస్‌ది పంటలు పండించే రాజకీయమైతే.. కాంగ్రెస్‌ది రాజకీయ మంటలు మండించే రాజకీయం అని ఎద్దేవా చేశారు. 'నాడు మల్లన్నసాగర్ ప్రాజెక్టు కట్టేటప్పుడు అడ్డంపడ్డారు.. కోర్టుల్లో కేసులు వేసిండ్రు.. ఇవ్వాళ సంతోషాన్ని పంచుకుందామని వస్తే డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నరు. కేసీఆర్ కట్టించిన ప్రాజెక్టులో 21 టీఎంసీల నీళ్లు వచ్చాయనే సంతోషంతో పసుపు కుంకుమ వేసి ఆ గోదావరి జలాలకు దండం పెట్టుకుందామని వచ్చాం. దీనిని కూడా అడ్డుకుంటారా? ఈ నీళ్లతో మెదక్, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో పంటలు పండటం కాంగ్రెస్ నేతలకు ఇష్టం లేదా?' అని హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇప్పటికైనా కాంగ్రెస్ నాయకులు మల్లన్నసాగర్‌కు వచ్చి పసుపు కుంకుమ వేసి కొబ్బరి కాయకొడితే వారి పాపాలు తొలగిపోతాయని వ్యాఖ్యానించారు.

కేసీఆర్ కట్టించిన కాళేశ్వరమే దిక్కు

'హైదరాబాద్‌కు మంచినీళ్లు తీసుకపోతా, మూసీకి నీళ్లు తీసుకపోతా అని సీఎం రేవంత్‌రెడ్డి అంటున్నారు. సంతోషమే.. కానీ, అదెట్లా సాధ్యమైంది? దానికి కూడా కేసీఆర్ కట్టించిన కాళేశ్వరం ప్రాజెక్టే కదా దిక్కు.. హైదరాబాద్‌కు నీళ్లు తీసుకపోవాలంటే మల్లన్నసాగరే కదా దిక్కు' అని హరీశ్‌రావు వ్యాఖ్యానించారు. కేసీఆర్ హయాంలోనే కాళేశ్వరం ప్రాజెక్టు కట్టి జిల్లాను సస్యశ్యామలం చేశారని చెప్పారు. కాళేశ్వరం ప్రాజెక్టు మీద లక్ష కోట్లు వృధా అయ్యాయని, కాళేశ్వరం కొట్టుకుపోయిందని ఎన్నికల ముందు కాంగ్రెస్ నేతలు దుష్ప్రచారం చేశారని హరీశ్‌రావు మండిపడ్డారు. వెంటనే అన్ని చెరువుల్లో, రిజర్వాయర్లలో చేపపిల్లలను వేయాలని డిమాండ్ చేశారు.

> 'కేసీఆర్ కల ఫలించింది. మల్లన్నసాగర్‌కు తొలిసారిగా 21 టీఎంసీల నీళ్లు వచ్చాయి.. సముద్రాన్ని తలిపించేలా నిండుకుండలా, కన్నులపండువగా ఉన్నది. ఇవ్వాళ చాలా సంతోషంగా ఉన్నది. యాసంగి పంటకు ఢోకాలేదు. నాలుగు జిల్లాలకు అద్భుతంగా నీళ్లు రాబోతున్నాయి. చెరువుల్లో నీళ్లు నిండిపోయాయి. కాళేశ్వరం ప్రాజెక్టు కింద పండే ప్రతి పంట మీద కేసీఆర్ పేరుఉంటది. ప్రతి రైతు గుండెలో కేసీఆర్ నిలబడి ఉంటడు.'
>
> -మాజీ మంత్రి హరీశ్‌రావు

పోలీసుల అత్యుత్సాహం

మల్లన్నసాగర్ రిజర్వాయర్ సందర్శనకు వచ్చిన మాజీ మంత్రి హరీశ్‌రావు బృందంతో పోలీసులు అనుచితంగా ప్రవర్తించారు. వారిని మల్లన్నసాగర్ బండ్ మీదికి రానియ్యకుండా అడ్డంకులు సృష్టించారు. పంపులు పోసే వరకు పోయిన బృందాన్ని అడ్డుకునే ప్రయత్నం చేశారు. ఒకదశలో బీఆర్ఎస్ కార్యకర్తలపై, కొంతమంది మీడియా ప్రతినిధులపై గజ్వేల్ ఏసీపీ పురుషోత్తంరెడ్డి రాయలేని భాషలో దుర్భాషలాడారు. అంతేకాకుండా బీఆర్ఎస్ కార్యకర్తల గల్లా పట్టుకొని చేయి చేసుకున్నారు. ఇదేమిటని ప్రశ్నించిన మరో కార్యకర్తతో కూడా దురుసుగా మాట్లాడారు. దీనిని చిత్రీకరిస్తున్న మీడియా ప్రతినిధులపై కూడా చిటపటలాడారు. ఏసీపీతో బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు వాగ్వాదానికి దిగారు. 'అట్లా మాట్లాడొద్దు సార్' అంటూ తోటి సీఐలు చెప్పేందుకు ప్రయత్నించినా ఏసీపీ వినలేదు. బీఆర్ఎస్ బృందం వెళ్లేప్పుడు మల్లన్నసాగర్ కట్టపై ట్రాఫిక్‌ను కూడా క్లియర్ చేయలేదు. పోలీసులు చూస్తూ ఉండటంతో బీఆర్ఎస్ కార్యకర్తలే ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.

లోకం పోకడ



ఒంటిపై కండువా వేయమంటారా?
కట్టె వేయమంటారా తేల్చుకోమనండి.. వెళ్లండి!

వానకాలం

	గరిష్ఠం	కనిష్ఠం
ఆదిలాబాద్	38.5°c	21.7°c
రంగారెడ్డి	38.2°c	21.1°c
మెదక్	37.2°c	21.0°c
నిజామాబాద్	34.4°c	24.3°c
హైదరాబాద్	34.2°c	24.2°c
నల్లగొండ	34.0°c	25.0°c
మహబూబ్‌నగర్	32.5°c	22.1°c
కరీంనగర్	32.0°c	25.0°c
వరంగల్	32.0°c	25.0°c
ఖమ్మం	31.0°c	24.0°c

సాగర్‌లో నీళ్లున్నా.. చెరువులు ఖాళీ

సర్కారు తీరుపై మంత్రి కోమటిరెడ్డి అసహనం
భట్టి, ఉత్తమ్ సమక్షంలోనే ప్రశ్నల వర్షం
ఏఎమ్మార్పీ నాలుగో మోటర్ ఆన్ చేయాలి

నల్లగొండ ప్రతినిధి, సెప్టెంబర్ 20 (నమస్తే తెలంగాణ): 'నాగార్జునసాగర్ రిజర్వాయర్‌లో ఫుల్ లెవల్ నీళ్లున్నా.. ఒక్క చెరువు, కుంటకు నీళ్లొస్తలేవు. పోయిన ఎండాకాలంలోనే నీళ్లు లేక బోర్లు ఎండిపోయినయ్. తోటలు ఎండిపోయినయ్. ఈ సారి ఇక్కడ వర్షాలు సరిగ్గా పడలేదు. కర్ణాటకలో కురిసిన వర్షాలతో సాగర్‌కు నీళ్లొస్తున్నయ్. వచ్చిన నీళ్లతో చెరువులు నింపకుంటే ఎట్ల? ఏఎమ్మార్పీ నాలుగో మోటర్ ఇంకెప్పుడు నడుపుతరు? రైతులకు ఎప్పుడు నీళ్లిస్తరు? ఇవ్వాల్టి నుంచి ఫోర్ డే మోటర్ రన్ చేసి నీళ్లు ఇవ్వాల్సిందే. నేను చెప్తున్న.. సీఈ గారూ నీళ్లు ఇవ్వాల్సిందే' అని ఆర్‌అండ్‌బీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి.. తమ ప్రభుత్వ అసమర్థతపై అసహనం వ్యక్తంచేశారు. అది కూడా ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సమక్షంలోనే ప్రశ్నించడం గమనార్హం. శుక్రవారం నల్లగొండ జిల్లా ఇరిగేషన్ ప్రాజెక్టులపై ఎల్ఎల్‌బీసీ టన్నెల్ ప్రాంతంలో సమీక్ష నిర్వహించారు. దీనికి ముఖ్యఅతిథిగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ఇరిగేషన్ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితోపాటు ఇరిగేషన్ ఈఎన్‌సీ అనిల్‌కుమార్ హాజరయ్యారు. వీరందరి సమక్షంలోనే మంత్రి కోమటిరెడ్డి ప్రభుత్వ అసమర్థతను ఒప్పుకొంటూ సీఈ అజయ్‌కుమార్‌ను నిలదీసినంత పనిచేశారు. వాస్తవంగా గత నెల 2న సాగర్ ఎడమ కాల్వతోపాటు ఏఎమ్మార్పీ ప్రధాన కాల్వకు, లోలెవల్ కెనాల్ ఆయకట్టుకు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి హెలికాప్టర్‌లో వచ్చిమరీ సాగునీటిని విడుదల చేశారు. కానీ నేటికీ ఏఎమ్మార్పీ, లోలెవల్ కెనాల్ ఆయకట్టులోని సుమారు 50 వేల ఎకరాల ఆయకట్టు సాగునీటికి నోచుకోలేదు. ఇందుకు ప్రధాన కారణం ఏఎమ్మార్పీ నాలుగు మోటర్లలో ఒక మోటర్ గత అక్టోబర్‌లో మరమ్మతుకు గురవడం. సాధారణంగా జూలై నాటికే మోటర్లను సిద్ధం చేసుకుని సాగర్‌కు నీరు రాగానే తోడిపోస్తారు. కానీ.. ఈ మోటర్ రిపేర్‌ను ప్రభుత్వం పెడచెవిన పెట్టింది. తీరా నాగార్జునసాగర్‌కు ఎగువ నుంచి వరద మొదలైనప్పుడు ప్రభుత్వం హడావుడిగా మొదలుపెట్టింది. వెంటనే పూర్తి చేసి గత నెల 31 నాటికే నాలుగో మోటర్ రన్ చేసి సాగునీటిని సమృద్ధిగా అందిస్తామని ప్రకటించింది. నేటికీ ఆ మోటర్ వినియోగంలోకి రాలేదు. దీంతో లోలెవల్ కెనాల్‌తోపాటు ఏఎమ్మార్పీ డీ-37, 39, 40 పరిధిలోని రైతులు ధర్నాలు, రాస్తారోకోలు, కలెక్టరేట్ ఎదుట నిరసనలు చేస్తూ.. కనిపించిన ప్రతి అధికారికీ వినతిపత్రాలు సమర్పిస్తున్నా ఫలితం లేదు. రైతుల ఆందోళనలతో మంత్రి కోమటిరెడ్డి తప్పనిసరి పరిస్థితుల్లో ప్రభుత్వ అసమర్థతను బయటపెట్టక తప్పలేదన్న వ్యాఖ్యలు సమావేశంలోనే వినిపించడం చర్చనీయాంశమైంది.

కులగణనపై రేపు అఖిలపక్ష సమావేశం

హైదరాబాద్, సెప్టెంబర్ 20 (నమస్తే తెలంగాణ) : కులగణనను సత్వరమే చేపట్టి స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచాలని డిమాండ్ చేస్తూ హోటల్ అశోకాలో ఆదివారం అఖిలపక్ష పార్టీలు, కుల, బీసీ సంఘాలతో సదస్సు నిర్వహించనున్నారు. ఈ మేరకు బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్ కృష్ణయ్య, జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. బీసీ రిజర్వేషన్లు పెంచాలని, పార్లమెంట్‌లో బీసీ బిల్లు పెట్టి చట్టసభల్లోనూ 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని, కేంద్రంలో ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని, రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 2 లక్షలు, కేంద్రంలో ఖాళీగా ఉన్న 16 లక్షల ఉద్యోగాలను భర్తీ చేయాలనే డిమాండ్లపై చర్చించనున్నట్టు వెల్లడించారు. కార్యక్రమానికి అన్ని పార్టీలు, బీసీ కుల, ఉద్యోగ సంఘాల నాయకులు తరలిరావాలని పిలుపునిచ్చారు.

మీడియాతో మాట్లాడుతున్న మధుసూదనాచారి. చిత్రంలో జోగు రామన్న, పల్లె రవికుమార్

బీసీ డిక్లరేషన్ అమలుదాకా పోరాటం

- బీసీల పోరాట ఫలితంగానే మహేశ్‌కుమార్‌కు పీసీసీ అధ్యక్ష పదవి
- శాసనమండలిలో బీఆర్ఎస్ పక్ష నేత మధుసూదనాచారి

హైదరాబాద్, సెప్టెంబర్ 20 (నమస్తే తెలంగాణ): కామారెడ్డిలో కాంగ్రెస్ ప్రకటించిన బీసీ డిక్లరేషన్‌ను అమలుచేసే వరకు బీఆర్ఎస్ పోరాడుతుందని శాసనమండలిలో బీఆర్ఎస్ పక్ష నేత ఎస్ మధుసూదనాచారి తెలిపారు. బీసీలను కాంగ్రెస్ పార్టీ ఇప్పటికీ ఓటు బ్యాంకుగానే చూస్తున్నదని ధ్వజమెత్తారు. తెలంగాణ భవన్‌లో శుక్రవారం మాజీ మంత్రి జోగు రామన్న, బీఆర్ఎస్ నేత పల్లె రవికుమార్‌తో కలిసి శాసనమండలిలో ఆయన మాట్లాడారు. పీసీసీ అధ్యక్షుడిగా వారంరోజులు కూడా కాని మహేశ్‌కుమార్‌గౌడ్.. దమ్ముందా? అని బీఆర్ఎస్ నేతలనుద్దేశించి మాట్లాడటం తగదని హితవు పలికారు. బీసీల పోరాటం ఫలితంగానే ఆయనకు ఆ పదవి వచ్చిందనే విషయాన్ని మరువొద్దని సూచించారు. బీసీ డిక్లరేషన్‌పై ఒత్తిడి తేవడంతోనే ఆయనను పీసీసీ అధ్యక్షుడిగా నియమించారని గుర్తుచేశారు. అన్ని పార్టీలు మారి కాంగ్రెస్‌లోకి వచ్చిన రేవంత్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా చేసిందని తెలిపారు. బీసీలకు ఏటా 20 వేల కోట్లు, ఐదేండ్లలో లక్ష కోట్లు కేటాయిస్తామని చెప్పి గత బడ్జెట్‌లో అందులో సగం కూడా కేటాయించలేదని విమర్శించారు. కేటాయించిన నిధులనూ ఖర్చు చేయడంలేదని ధ్వజమెత్తారు.బీసీలను ఓటు బ్యాంకుగా చూడొద్దని, అన్యాయం చేస్తే ప్రతిఘటన ఎదుర్కోక తప్పదని హెచ్చరించారు. పలుకుబడి ఉంటే మహేశ్‌కుమార్‌గౌడ్ బీసీలకు ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు సీఎంపై ఒత్తిడి తేవాలని ఆయన డిమాండ్ చేశారు.

వెడ్మ బొజ్జు వ్యాఖ్యలు అనాగరికం

డీజీపీ చర్యలెందుకు తీసుకోవద్దు?
బీఆర్ఎస్ నేత దాసోజు శ్రవణ్

హైదరాబాద్, సెప్టెంబర్ 20 (నమస్తే తెలంగాణ): బీజేపీ ఎంపీ రవ్‌నీత్ సింగ్ బిట్టు తలనరికి తీసుకొస్తే తన తండ్రి సంపాదించిన ఎకరం 38 గుంటల భూమిని రాసిస్తానని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు చేసిన వ్యాఖ్యలు తీవ్ర అభ్యంతరకరంగా, అనాగరికంగా ఉన్నాయని బీఆర్ఎస్ నేత దాసోజు శ్రవణ్ మండిపడ్డారు. ఈ విషయంపై శుక్రవారం ఆయన ఎక్స్‌లో ట్వీట్ చేశారు. 'ఈ ప్రకటన తెలంగాణలో అనాగరిక, నేరపూరిత సుపారీ, దిగజారుడు రాజకీయాలు, నాయకత్వానికి నిదర్శనం. రాహుల్‌పై బీజేపీ నేత వ్యాఖ్యలు నిస్సందేహంగా ఖండించదగినవే. ఓ వ్యక్తి తలనరికివేయమని ఒక ఎమ్మెల్యే బహిరంగంగా పిలుపునివ్వడాన్ని ఎలా సమర్థిస్తారు? ఒక తప్పును సమర్థించడానికి ఇంకొక తప్పు చేయకూడదు. ఈ విషయంలో రాహుల్‌గాంధీ నిర్లక్ష్యంగా ఉన్నారు. సీఎం రేవంత్‌రెడ్డిని అనుకరించడం, అసభ్యకరమైన భాషను ఉపయోగించడంలో ఆంతర్యం ఏంటి? ఇది ఎలాంటి అక్రమం(జంగల్ రాజా)? ఒక ఎమ్మెల్యే ఐపీసీని ఉల్లంఘిస్తూ ఇలా హింసను ప్రేరేపించగలిగితే, డీజీపీ, తెలంగాణ పోలీసులు ఎందుకు చర్యలు తీసుకోలేదు.

మీడియాతో మాట్లాడుతున్న మాజీ ఎంపీ లింగయ్యయాదవ్. చిత్రంలో మల్లయ్యయాదవ్, భగత్

పంటలు ఎండుతున్నా పట్టించుకోరా?

- ఎడమ కాలువ గండి మరమ్మతులెప్పుడు?
- ప్రజల్ని గాలికొదిలి మంత్రి విహారయాత్రా?
- లింగయ్య యాదవ్, బొల్లం మల్లయ్య, నోముల భగత్ మండిపాటు

హైదరాబాద్, సెప్టెంబర్ 20 (నమస్తే తెలంగాణ): పంటలు ఎండిపోతున్నా కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, నాగార్జునసాగర్ ఎడమ కాలువకు గండి పడి 20 రోజులైనా మరమ్మతులు చేయకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారని బీఆర్ఎస్ నాయకులు ఆగ్రహం వ్యక్తంచేశారు. మాజీ ఎంపీ లింగయ్య యాదవ్, మాజీ ఎమ్మెల్యేలు బొల్లం మల్లయ్య యాదవ్, నోముల భగత్ శుక్రవారం తెలంగాణ భవన్‌లో మీడియా సమావేశంలో మాట్లాడుతూ భారీ వర్షాలతో చెరువులు, కాలువలకు పడిన గండ్లను పూడ్చకుండా రైతులకు నష్టం కలిగిస్తున్నారని విమర్శించారు. ఖమ్మంలో వరదలకు దెబ్బతిన్న కాలువలు, సాగర్ ఎడమ కాలువకు వెంటనే మరమ్మతులు చేయాలని డిమాండ్ చేశారు. పంటకు నీళ్లందక రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారని, ప్రజలను గాలికొదిలేసి మంత్రి ఉత్తమ్ కుటుంబంతో విహార యాత్రలు చేస్తున్నాడని విమర్శించారు. మంత్రి నియోజకవర్గంలో సర్కారు వైద్యులు అందుబాటులో లేక నర్సులే గర్భిణికి ప్రసవం చేయడం వల్ల శిశువు చనిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. రుణమాఫీ అడిగిన రైతులను అరెస్ట్ చేసి జైల్లో పెడుతున్నారని మండిపడ్డారు. ప్రజాసమస్యలపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న మంత్రులను బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. కౌలు రైతులకూ రైతుబంధు ఇస్తామని చెప్పి ఇప్పుడు కౌలు రైతు, యజమాని మాట్లాడుకోవాలని మంత్రి అంటున్నాడని, ఇదెక్కడి న్యాయమని ప్రశ్నించారు. హెలికాప్టర్‌ను వాడుకోవడంలో నల్లగొండ జిల్లా మంత్రులు పోటీ పడుతున్నారని, 25, 30 కిలోమీటర్లు కూడా హెలికాప్టర్‌లో పోతున్నారని ఎద్దేవాచేశారు.



ఖమ్మం జిల్లా కల్లూరు ఇరిగేషన్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

ఎన్నెస్పీ జలాలు విడుదల చేయాలి

- ఖమ్మం జిల్లాలో ఎన్నెస్పీ అధికారులు ఆర్డీవోకు బీఆర్ఎస్ నాయకుల వినతి
- కోమట్లగూడెం, నేరడ గ్రామాల్లో దెబ్బతిన్న పంటల పరిశీలన

పెనుబల్లి/చింతకాని, సెప్టెంబర్ 20: పంటలకు నీరందక పొట్టదశలో ఉన్న వరితోపాటు పత్తి, మిర్చి ఎండిపోతున్నాయని, వెంటనే ఎన్నెస్పీ జలాలను విడుదల చేసి కాపాడాలని బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రైతులు ఖమ్మం జిల్లా కల్లూరు ఎన్నెస్పీ కార్యాలయం ఎదుట శుక్రవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ.. జిల్లాలో ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదలతో సాగర్ కాల్వలు దెబ్బతిన్నాయని, దాదాపు 20 రోజులు దాటినా వాటిని మరమ్మతు చేయడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. జిల్లా నుంచి ముగ్గురు మంత్రులున్నా.. కనీసం రైతుల సమస్యలను పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఇటీవల సీతారామ ప్రాజెక్టు కాల్వలను ప్రారంభించి హడావిడి చేశారే తప్ప కాల్వల నుంచి నీళ్లు రావడం లేదని, దీంతో కల్లూరు, పెనుబల్లి మండలాల్లోని పంట భూములకు నీరందడం లేదని విమర్శించారు. వెంటనే సాగర్ జలాలు వదలాలని డిమాండ్ చేస్తూ నీటిపారుదల శాఖ అధికారులకు, ఆర్డీవోకు బీఆర్ఎస్ నాయకులు, రైతులు వినతిపత్రం అందజేశారు. బీఆర్ఎస్ మండల కమిటీ ఆధ్వర్యంలో రైతులు ఖమ్మం జిల్లా చింతకాని మండలం కోమట్లగూడెం, నేరడ గ్రామాల సమీపంలోని సాగర్ ఆయకట్టు పరిధిలో ఎండిపోతున్న వరి, పత్తి, మక్కజొన్న, మిర్చి పంటలను పరిశీలించారు. వెంటనే సాగర్ నీటిని విడుదల చేయాలని తహసీల్దార్ అనంతరాజుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నేతలు, రైతులు పాల్గొన్నారు.

హెరిటేజ్ జాతర.. 'విజయ'కు పాతర

మొదటిపేజీ తరువాయి...

కలిసిపోవటం ఖాయమనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వ సహకారంపై ఆధారపడే విజయ డెయిరీ.. హెరిటేజ్ వంటి రాజకీయ పలుకుబడిగల సంస్థతో పోటీపడటం కష్టమేననే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికే ప్రైవేట్ డెయిరీల నుంచి పోటీని తట్టుకోలేక చతికిలపడిన విజయ డెయిరీకి హెరిటేజ్ పెట్టుబడులు శరాఘాతంగా మారటం ఖాయమన్న అభిప్రాయం వెల్లడి అవుతున్నది.

హెరిటేజ్‌కు రేవంత్ ప్రభుత్వ సహకారం?

ఏపీ సీఎం చంద్రబాబు, తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి మధ్య అనుబంధం గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. దీపం ఉన్నప్పుడే ఇల్లు చక్కదిద్దుకోవాలనే సామెత చందంగా తెలంగాణలో తమ అనుకూల ప్రభుత్వం ఉన్నప్పుడే హెరిటేజ్ సంస్థను విస్తరించాలనే ఆలోచనలో సదరు సంస్థ ఉన్నట్టుగా తెలిసింది. ఇందులో భాగంగానే ఈ భారీ ప్లాన్ చేసినట్టు చర్చ జరుగుతున్నది. హెరిటేజ్ సంస్థకు రేవంత్ ప్రభుత్వం కూడా పరోక్షంగా సహాయ సహకారాలు అందిస్తున్నదనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. అందుకే విజయ డెయిరీని నిర్లక్ష్యం చేస్తున్నదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. పాడి రైతులకు పాల బిల్లులు చెల్లించకపోవటం, ఆ సంస్థ నష్టాల్లో కూరుకుపోతున్నా పట్టించుకోకపోవటం, స్వయంగా ఈ శాఖకు సీఎం రేవంత్‌రెడ్డి మంత్రి అయినా ఆ శాఖపై ఇప్పటివరకు సమీక్ష చేయకపోవటం, కనీసం సంస్థ బాగోగుల గురించి ఆరా తీయకపోవటం వంటి ఘటనలు అనేక ఆరోపణలకు బలం చేకూర్చుతున్నాయి.

అందుకే పాల బిల్లులు చెల్లించటం లేదా?

బీఆర్ఎస్ హయాంలో విజయ డెయిరీకి పాలు పోసే పాడి రైతులకు ప్రతి 15 రోజులకోసారి తంచనుగా బిల్లులు వారి ఖాతాలో పడేవి. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక పాడి రైతులకు కష్టాలు మొదలయ్యాయి. 3